

శ్రీవారి సేవలో..
ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాన్ని ఎన్నికల వ్యయ పరిశీలకులు పి.కీర్తి నారాయణ్, గౌరవ్ సోమవారం సందర్శించారు. ప్రత్యేక పూజలు చేయించారు.



పోలింగ్ బహిష్కరణ
కొయ్యలగూడెం మండలంలోని నరిపల్లి పంచాయతీ పరిధిలోని వంకబొత్తప్పగూడెం గిరిజనులు పోలింగ్‌ను బహిష్కరిస్తూ ఆందోళనకు దిగారు. 8లో ▸

మహిళ దారుణ హత్య
కొయ్యలగూడెం మండలం యర్రంపేటలో గ్రామంలో సోదెం అరుణ అనే మహిళ దారుణ హత్యకు గురైంది. ఎస్సై విష్ణువర్ధన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.
8లో





అత్తిలిలో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి కారుమూరి, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్



ఏలూరులో ఓటేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని



బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో ఓటేసిన ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మి



కొండలరావుపాలెంలో ఓటేసిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



నిడమర్రు మండలం బువ్వనపల్లిలో ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



నూజివీడులో ఓటేసిన ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు

ఓటెత్తిన ఏలూరు

పోలింగ్ ప్రశాంతం
- 83.04 శాతం పోలింగ్ నమోదు
- జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు
- రాత్రి 9 గంటల వరకు సాగిన ఓటింగ్ ప్రక్రియ
- స్ట్రాంగ్‌రూమ్‌కు చేరుతున్న ఈవీఎంలు, వీవీప్యాట్‌లు
- పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లా ఓ (పో) టెత్తింది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కీలకమైన పోలింగ్ ప్రక్రియ పూర్తిస్థాయి ప్రశాంత వాతావరణంలో సాగింది. ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,774 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించారు. మండుటెండలో సైతం క్యూలైన్లో ఓటర్లు బారులు తీరడం విశేషం. పోలింగ్ ముగిసే సమయానికి జిల్లావ్యాప్తంగా 83.04 శాతం పోలింగ్ నమోదైంది. సుమారు 40 బూత్‌ల్లో 8 గంటలు దాటే వరకు పోలింగ్ కొనసాగింది. ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థులు, ప్రముఖులు ఓటుహక్కు వినియోగించుకోగా కేంద్ర ఎన్నికల సంఘ పరిశీలకులు, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ డి. మేరీ ప్రశాంతి పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ సరళిని, బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉదయం 7 గంటల నుంచి..

ఉదయం 7 గంటలకే జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఉదయం 9 గంటలకు 10.53 శాతం, ఉదయం 11 గంటలకు 24.23 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 40.05 శాతం, మధ్యాహ్నం 3 గంటలకు 59.14 శాతం, సాయంత్రం 5 గంటలకు 72.03 శాతం, సాయంత్రం 6 గంటలకు 75.05 శాతం పోలింగ్ నమోదైంది. 16,37,430 మంది ఓటర్లకుగాను 12,28,973 మంది ఓటర్లు సాయంత్రం 6 గంటల సమయానికి ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 5,95,441 మంది పురుషులు, 6,33,478 మంది మహిళలు ఉన్నారు. మొత్తంగా జిల్లాలో పురుషులు కంటే మహిళలే ఎక్కువగా పోలింగ్‌లో పాల్గొన్నారు. సుమారుగా 5 నుంచి 7 శాతం మహిళా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



ఏలూరు నవయుగ స్కూల్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

ఓటు వేశానంటూ సెల్ఫీ తీసుకుంటూ..

పోలింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

ఏలూరు జిల్లా యంత్రాంగం పోలింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఓటింగ్ శాతం పెంచేందుకు అవగాహన సదస్సులు, ఇతర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించింది. కలెక్టరేట్‌లో భారీ డిజిటల్ కౌంట్‌డౌన్ గడియారాన్ని విద్యుత్ శాఖ నేతృత్వంలో ఏర్పాటు చేశారు. అలాగే ఏలూరుకు 180 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొయిదా గ్రామ పంచాయతీలోని కాకిసనూరు పోలింగ్ కేంద్రంలో 472 మంది ఓటర్లు ఉన్నారు. అక్కడ పోలింగ్ అధికారులకు, సిబ్బందికి గిరిజన సంప్రదాయరీతిలో స్వాగతం పలికారు. అలాగే ఏలూరు జిల్లా కేంద్రంలో 2,044 వెబ్ కాస్టింగ్ కెమెరాలతో పోలింగ్ సరళిని పరిశీలించే ఏర్పాట్లు చేశారు. ఓటర్లకు గ్రో గ్రీన్ నినాదంతో కొన్నిచోట్ల మొక్కలు పంపిణీ చేశారు. అలాగే డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, బాలల సంరక్షణాధికారి సూర్యచక్రవేణి సంప్రదాయ వస్త్రధారణతో ఓటర్లను స్వాగతించారు. సోమవారం ఉదయం 5.30 గంటల్లోపు అన్ని పోలింగ్ కేంద్రాల్లో మాక్‌పోల్ నిర్వహించే సాంకేతిక సమస్యలున్న ఈవీఎంలను సరిచేశారు. అలాగే 415 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో 2,044 వెబ్‌కాస్టింగ్ కెమెరాలను ఏర్పాటుచేశారు. సీనియర్ సిటిజన్లు, విభిన్న ప్రతిభావంతులకు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఓటింగ్ సరళి ఇలా..

జిల్లాలో ఉదయం నుంచి పోలింగ్ శాతం క్రమేపీ పెరుగుతూ వచ్చింది. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల మధ్య, మధ్యాహ్నం 1 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య 1,774 పోలింగ్ కేంద్రాల్లో అత్యధిక పోలింగ్ శాతం నమోదైంది. ఏలూరులో ఎమ్మెల్యే ఆళ్ల నాని, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసే సమయానికి జిల్లాలో అత్యధికంగా ఉంగుటూరు నియోజకవర్గంలో 87.75 శాతం, అత్యల్పంగా ఏలూరులో 71.02 శాతం పోలింగ్ నమోదైంది.

పోలింగ్ శాతం ఇలా..

నియోజకవర్గం	ఉ. 9 గంటలు	11 గంటలు	మ.1 గంట	3 గంటలు	సా.5 గంటలు	రాత్రికి..
చింతలపూడి	9.07	22.80	38.66	55.45	69.00	80.05
దెందులూరు	11.20	26.85	42.90	60.66	74.25	85.01
ఏలూరు	10.74	27.96	38.04	54.22	64.59	71.02
కైకలూరు	9.10	24.13	39.69	61.73	73.78	87.50
నూజివీడు	9.88	24.91	42.11	64.62	77.08	87.32
పోలవరం	9.91	22.03	37.13	58.86	72.29	84.16
ఉంగుటూరు	11.31	25.18	42.64	59.38	74.22	87.75
మొత్తం	10.53	24.32	40.05	59.14	72.03	83.04



కైకలూరులో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)



కామవరపుకోటలో ఓటేసిన చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు



కొవ్వూటలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ



పెదపాడు మండలం సత్యవోలులో ఓటేసిన జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ



ఏలూరులో ఓటేసేందుకు లైనులో నిలుచున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



పోలీసు సహకారంతో పోలింగ్ కేంద్రం వద్దకు..



వేలిపై సిరా చుక్క చూపిస్తున్న మహిళలు



వృద్ధుడికి సాయమందిస్తూ..



ఏలూరు కేపీడీటీ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో యువతులు



పోలింగ్ సామగ్రికి సీల్ వేస్తున్న ఎన్నికల సిబ్బంది



పోలింగ్ కేంద్రం వద్ద వృద్ధుడికి సాయమందిస్తూ..



ఏలూరు గాంధీనగర్ స్కూల్‌లో బారులు తీరిన మహిళలు



ఏలూరు బీడీ కాలనీలోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల రద్దీ

న్యూస్‌రీల్

పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): జిల్లావ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగింది. చెదురుమదురు ఘటనలు మినహా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. జిల్లాలోని 1,744 పోలింగ్ కేంద్రాల్లో వేకువ జామునే మాక్ పోలింగ్‌తో ప్రారంభించిన ఓటింగ్ సరళి, ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ మేరీ ప్రశాంతి వెబ్‌కాస్టింగ్ ద్వారా ఓటింగ్ సరళిని పరిశీలించారు. సాంకేతిక సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు తక్షణమే ఈవీఎంల సమస్యలు పరిష్కరించి పోలింగ్ సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకున్నారు. ఎన్నికల విధుల్లో సుమారు 20 వేల మంది అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి వరకూ చేరుతూ..

జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు స్ట్రాంగ్ రూమ్‌కు అర్ధరాత్రి వరకు చేరుకుంటూనే ఉన్నాయి. అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ కలెక్టర్, ఎస్పీల సమక్షంలో ఈవీఎంలను ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. ఈవీఎంలు భద్రపరిచే ప్రక్రియ మంగళవారం వేకువజాము వరకు సాగనుంది. ఏలూరు చేరుకున్న పోలింగ్ సిబ్బందికి వారికి కేటాయించిన రూట్లలో బస్సులను సైతం తిరిగి పంపించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మూడంచెల భద్రత నడుమ ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలు, పోలింగ్ మెటీరియల్‌ను భద్రపరిచారు.

ఎన్నికల కమిషన్ కితాబు



సంప్రదాయ దుస్తుల్లో ఓటర్లకు స్వాగతం పలుకుతున్న డీపీఓ

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఎన్నికలపై అవగాహన కల్పించే విధుల్లో భాగంగా జిల్లా ఎన్నికల అధికారుల తీరును ట్విట్టర్ వేదికగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ కొనియాడింది. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో సంప్రదాయ వస్త్రాలతో ఓటర్లను స్వాగతం పలకడాన్ని అభినందించింది. అలాగే మారుమూల కొండరెడ్డి ప్రాంతమైన కాకిసనూరుకు గోదావరి నదిపై బోటుపై వెళ్లి విధులు నిర్వహించిన పోలింగ్ సిబ్బందిని సత్కరించడం వంటి కార్యక్రమాలకు ప్రశంసలు కురిపించింది.

14 సార్లు ఓటు వేశా



పాలేటి బ్రహ్మారావు, రిటైర్డ్ టీచర్

భీమడోలు: ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరూ ఓటు హక్కును బాధ్యతతో ఉపయోగించుకోవాలని 90 ఏళ్ల వయసున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు పాలేటి బ్రహ్మారావు అన్నారు. భీమడోలులో సోమవారం ఆయన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం మాట్లాడారు. తాను 1957 సార్వత్రిక ఎన్నికల నుంచి ఇప్పటివరకు 14 సార్లు ఓటు వేశానని అన్నారు. ఎన్నికల సంఘం తనకు హోమ్ ఓటింగ్‌కు అవకాశం ఇచ్చిందని, అయినా తాను పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసేందుకే మొగ్గు చూపానన్నారు. తనకు ఓపిక ఉండటంతో క్యూలైన్‌లో నిలుచుకుని ఓటు హక్కు వినియోగించుకున్నానన్నారు. 14 సార్లు ఓటు వేసే భాగ్యాన్ని భగవంతుడు కలిగించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిఒక్కరూ ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని కోరారు.

ఓటేసేందుకు ఆస్ట్రేలియా నుంచి..



మురళీ రామ్మోహన్‌రావు

గణపవరం(నిడమర్రు): సముద్రాలు దాటి ఆస్ట్రేలియా నుంచి స్వగ్రామం చిలకంపాడు గ్రామానికి ఓటు వేసేందుకు వచ్చినట్టు మురళీ రామ్మోహన్‌రావు అనే యువకుడు తెలిపారు. 11న రాత్రి ఆస్ట్రేలియా నుంచి బయలుదేరి సోమవారం మధ్యాహ్నానికి చిలకంపాడు చేరుకున్నానని, ఓటు విలువ గ్రామస్తులకు తెలియజేసేందుకు వ్యయప్రయాసలతో వచ్చానని అన్నారు.

మూలలంకలో ఘర్షణ..

వైఎస్సార్‌ సీపీ నేతకు గాయాలు



గాయపడ్డ జోగి కుమార్‌

కలిదిండి : మూలలంక గ్రామంలో 207, 208, 209 పోలింగ్‌ కేంద్రాల వద్ద వైఎస్సార్‌ సీపీ, కూటమి పార్టీల నాయకుల మధ్య సోమవారం ఘర్షణ ఏర్పడింది. ఈ ఘర్షణలో వైఎస్సార్‌ సీపీ నాయకులు, రైతు భరోసా చైర్మన్‌ జోగి కుమార్‌కు గాయాలు కాగా, 108 వాహనంలో కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.



బుట్టాయగూడెం: కేఆర్‌పురంలో నడవలేని మహిళను ఓటు వేసేందుకు తీసుకువెళ్తున్న దృశ్యం



ఏలూరు టౌన్‌ : సుబ్బమ్మదేవి స్కూల్‌లో పోలింగ్‌ కేంద్రానికి వీల్‌చైర్‌లో వస్తున్న ఓ వృద్ధురాలు



భీమడోలు: భీమడోలులో ఓటు వేసిన సూర్యారావుపేటకు చెందిన వృద్ధురాలు



జంగారెడ్డిగూడెం రూరల్‌: చక్రదేవరపల్లిలో ఓటు వేసి తిరిగి వెళుతున్న వృద్ధుడు



పాలకోడేరు: శృంగవక్షంలో మనవరాలి సాయంతో వీల్‌చైర్‌లో వచ్చిన వృద్ధుడు రేలంగి బలరాంమూర్తి

ముదిమిలోనూ మురిపెం

వీల్‌చైర్లలో, నడుచుకుంటూ పోలింగ్‌ కేంద్రాలకు తరలివచ్చిన దివ్యాంగులు, వృద్ధులు

ఉత్సాహంగా ఓటు వేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచిన పండుటాకులు



తాడేపల్లిగూడెం: 93 ఏళ్ల ఉంగరాల వీరరాఘవమ్మ



కలిదిండి: సానా రుద్రవరంలో తన ఓటు హక్కును వినియోగించుకున్న 90 ఏళ్ల వద్ధురాలు

ముదిమిలోనూ ఉత్సాహంగా ఓటు వేసి ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారు పలువురు వృద్ధులు. వయస్సు మళ్లినా లెక్కచేయకుండా నడుచుకుంటూ, కొందరు వీల్‌ చైర్‌లో ఇలా పోలింగ్‌ కేంద్రాలకు చేరుకున్నారు. వృద్ధులతో పాటు పలువురు దివ్యాంగులు కూడా జిల్లాలోని పలు పోలింగ్‌ కేంద్రాల్లో సోమవారం ఓటు వేశారు. బంధువులు, పోలీసులు, కొందరు ఓటర్లు వీరికి మానవతా దృక్పథంతో వీరికి సాయమందించారు.

– సాక్షి, నెట్‌వర్క్‌



పాలకోడేరు : శృంగవృక్షంలో ఓటు వేసిన వృద్ధుడు పెద్దిరెడ్డి అప్పారావు



మొగల్తూరు : శ్రీహరిపేటలో ఓటు వేయడానికి వచ్చిన వృద్ధురాలు



పాలకొల్లు అర్బన్‌ : పాలకొల్లులో అల్లు వెంకటేశ్వరరావు మునిసిపల్‌ స్కూలు వద్ద వృద్ధుడ్ని వీల్‌చైర్‌లో తీసుకువస్తున్న పోలీసు



ఉండి: వాండ్రంలో ఓటు వేసేందుకు వీల్‌చైర్‌లో..



నరసాపురం రూరల్‌ : సీతారామపురంలో ఓ వ్యక్తికి సాయం చేస్తున్న ఓటర్లు



అత్తిలి : అత్తిలిలో ఓటేయడానికి వచ్చిన ఓ వృద్ధురాలు



పెనుగొండ: చిన్నంవారిపాలెంలో వృద్ధురాలిని ఆటోలో తీసుకువచ్చిన స్థానికులు

ఓటు వేయడానికి వచ్చి నేత కార్మికుడి మృతి



మృతుడు ప్రభాకరరావు

కైకలూరు: ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎంతో ఉత్సహంగా వచ్చి 'క్యూ' లైన్‌లో నిలబడిన వ్యక్తి మృతి చెందిన ఘటన ఏలూరు జిల్లా కైకలూరు మండలం వింజరం గ్రామంలో సోమవారం జరిగింది. వింజరం పంచాయతీ శివారు సాలిపేటకు చెందిన గోనె ప్రభాకరరావు (65) చేనేత కార్మికుడు. భార్య, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం చేశారు. ఆయన గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన 167వ నంబర్‌ పోలింగ్‌ బూత్‌లో ఓటు వేయడానికి మధ్యాహ్నం వచ్చారు. క్యూలైన్‌లో నిలుచుని ఉన్న ప్రభాకరరావు కొద్దిసేపటికి ఒక్కసారిగా కుప్పకూలారు. స్థానికులు వెంటనే స్పందించి హుటాహుటిన కైకలూరు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ప్రభాకరరావు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. ఓటు వేయడానికి ఉత్సాహంగా వచ్చిన గ్రామస్తుడు విగతజీవిగా మారడంతో ప్రతి ఒక్కరూ కన్నీరు పెట్టుకున్నారు.

దేగాపురంలో ఓటు వేయడానికి వచ్చి..

భీమవరం అర్బన్‌ : దేగాపురంలోని పోలింగ్‌ కేంద్రంలో సోమవారం ఓటు వేసేందుకు వచ్చి ఓ వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పిల్లి ఆశీర్వాదం (60) గత కొద్ది నెలల క్రితం గుండెకు శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్దనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఉదయమే గ్రామంలోని 83వ నంబర్‌ పోలింగ్‌ కేంద్రానికి వచ్చి ఆశీర్వాదం క్యూలైన్‌లో నిలబడ్డారు. అయితే ఈవీఎం సుమారు రెండు గంటలు మొరాయించడంతో క్యూలైన్‌లో నిలబడిన ఓటర్లు అలసటకు గురయ్యారు. అసలే వృద్ధుడు, పైగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ఆశీర్వాదం అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే బంధువులు భీమవరంలోని ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే ఆశీర్వాదం మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఓటేసి వెళుతూ మృత్యుఒడికి..

పాలకొల్లు అర్బన్‌ : చింతపర్రులో ఓటు వేసి ఇంటికి వెళుతుండగా ప్రమాదానికి గురై ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతపర్రు గ్రామానికి చెందిన తానేటి నాగమణి (68) ఓటు వేసేందుకు తన కుమారుడి మోటార్‌సైకిల్‌పై పోలింగ్‌ కేంద్రానికి చేరుకున్నారు. ఓటు వేసిన అనంతరం ఆమె మోటార్‌సైకిల్‌పై ఇంటికి వెళుతూ ప్రమాదవశాత్తూ జారిపడిపోయారు. దీంతో ఆమెను ఇంటికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స అందించే లోపే ప్రాణాలు కోల్పోయారు. నాగమణికి ముగ్గురు కుమారులు ఉన్నారు. భర్త చాలా రోజుల క్రితమే చనిపోయారు. ఆమె వృద్ధాప్య పింఛను ప్రతి నెలా అందుకుంటున్నారు. గత నాలుగు రోజుల నుంచి ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

యర్రంపేటలో మహిళ దారుణ హత్య



సోదెం అరుణ (ఫైల్‌)

కొయ్యలగూడెం : యర్రంపేటలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. ఎస్సై జీజే విష్ణువర్ధన్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో నివాసం ఉంటున్న సోదెం అరుణ (32) సోదరికి రాజవరం గ్రామానికి చెందిన దారం రాంబాబుతో వివాహమైంది. అయితే సోదరి మృతి చెందింది. ఈ క్రమంలో రాంబాబుతో సోదెం అరుణకు వివాహేతర సంబంధం ఏర్పడింది. వీరి మధ్య మనస్పర్ధలు రావడంతో గత కొంతకాలంగా విడివిడిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో అరుణపై అనుమానంతో ఆమెను అంతమొందించాలని రాంబాబు పథకం పన్నాడు. దీనిలో భాగంగా కత్తితో అరుణ ఇంట్లోకి ప్రవేశించగా, నిద్రిస్తున్న ఆమె పీక కోసి రాంబాబు పరారయ్యాడు. ఈ ఘటనలో అరుణ అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎస్సై సిబ్బందితో కలిసి సోమవారం ఘటనా స్థలానికి చేరుకుని రక్తపు మడుగులో పడి ఉన్న మహిళ మృతదేహాన్ని, సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మభ్యపెట్టి సైకిల్‌, కమలానికి ఓట్లేశారు





అంగన్‌వాడీ టీచర్‌ లక్ష్మి, పీఓ జానకి

ద్వారకాతిరుమల : నల్లజర్ల మండలం సుభద్రపాలెం, తెలికిచర్లలో సోమవారం జరిగిన పోలింగ్‌లో ఇద్దరు ఉద్యోగులు ఓటర్లు వేయమన్న సింబల్‌కు కాకుండా సైకిల్‌, కమలంపై ఓట్లు వేసి తమ ప్రేమను చాటారు. ఆ ఇద్దరు ఉద్యోగుల్లో ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లికి చెందిన అంగన్‌వాడీ టీచర్‌ ఉన్నారు. స్థానికుల కథనం ప్రకారం.. బిరుదుగడ్డ నందెమ్మ అనే దివ్యాంగురాలు సుభద్రపాలెంలోని 127వ నంబర్‌ పోలింగ్‌ బూత్‌లో ఓటు వేసేందుకు వెళ్లింది. అక్కడ ఓపీఓగా విధులు నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీ టీచర్‌ లక్ష్మి సహాయం కోరింది. అయితే ఆ టీచర్‌ నందెమ్మ చెప్పిన గుర్తుకు కాకుండా కమలం, సైకిల్‌కు ఓటు వేసింది. దీన్ని గుర్తించిన బాధిత నందెమ్మ ఈ విషయాన్ని పోలింగ్‌ కేంద్రంలోని అధికారులకు, బయట ఉన్న స్థానికులకు తెలిపింది. దీంతో అసలు విషయం బయటపడటంతో అధికారులు ఆమెను బయట కూర్చోబెట్టారు. ఇదిలా ఉంటే సదరు అంగన్‌వాడీ టీచర్‌ భర్త టీడీపీలో కీలక పదవిలో ఉన్నాడని, ఆమె కుమార్తెను దెందులూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకరరావు బంధువుకిచ్చి వివాహం చేసినట్టు చెబుతున్నారు. దీంతో టీడీపీపై ఆమెకున్న ప్రేమను ఇలా ఓట్లు వేసి చూపిందని అంటున్నారు. అదే విధంగా తెలికిచెర్లలోని 166 వ నంబర్‌ పోలింగ్‌ బూత్‌లో ఓటు వేసేందుకు పదిలం సరోజ, గోపిశెట్టి సూర్యకుమారి, తుమ్మల భాగ్యవతి తదితరులు అక్కడ పీఓగా విధులు నిర్వర్తిస్తున్న జానకి సహాయాన్ని కోరారు. అయితే వారు చెప్పిన సింబల్స్‌కు కాకుండా సైకిల్‌, కమలం గుర్తులకు ఆమె ఓట్లు వేయడాన్ని ఆ బూత్‌ ఏజెంట్లు, బాధిత ఓటర్లు గుర్తించారు. ఈ ఘటనపై ఎన్నికల రిటర్నింగ్‌ అధికారికి ఫిర్యాదు చేయడంతో జానకి స్థానంలో సెక్టోరియల్‌ అధికారిగా వై.సత్యనారాయణను నియమించారు. అలాగే పీఓ జానకిని పోలీసుల సెక్యూరిటితో ఆర్‌ఓ కార్యాలయానికి తీసుకెళ్ళారు. పీఓ జానకి ఉదయం నుంచి ఇదేవిధంగా ఓట్లు వేసిందని అక్కడివారు చెబుతున్నారు. అయితే ఉన్నతాధికారులు వీరిపై ఏవిధమైన చర్యలు తీసుకుంటారన్నది వేచి చూడాల్సి ఉంది.

వంకబొత్తప్పగూడెంలో పోలింగ్‌ బహిష్కరణ

ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్న అధికారుల హామీతో సజావుగా పోలింగ్‌



వంకబొత్తప్పగూడెంలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

కొయ్యలగూడెం: సరిపల్లి పంచాయతీ పరిధిలోని వంకబొత్తప్పగూడెం గిరిజన గ్రామస్తులు సోమవారం పోలింగ్‌ను బహిష్కరిస్తూ ఆందోళనకు దిగారు. ఎంపీపీ స్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్‌ బూత్‌ వద్ద గ్రామస్తులు అంతా ఏకమై తాము ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు పేర్కొంటూ నిరసన వ్యక్తం చేశారు. గత రెండు దశాబ్దాలుగా కొయ్యలగూడెం మండలంలోని గిరిజన గ్రామాలను అన్నీ కలిపి ఒక పంచాయతీగా చేయాలని, అదేవిధంగా తమను ఐటీడీఏ పరిధిలోకి తీసుకురావాలంటూ డిమాండ్‌ చేస్తున్నప్పటికీ ఏ ప్రభుత్వాలు కూడా తమ గోడును పట్టించుకోలేదని వాపోయారు. ప్రతి సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ తాము ఎన్నికలను బహిష్కరించడం, తరువాత అధికారులు వచ్చి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరుగుతుందే గాని తమకు న్యాయం జరగడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్‌ జయలక్ష్మి, ఎస్సై జీజే విష్ణువర్ధన్‌ గ్రామస్తులతో చర్చించి వారి డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పోలింగ్‌ సజావుగా కొనసాగింది.

అధికారుల అత్యుత్సాహం.. వైఎస్సార్‌ సీపీ ఓట్లకు గండి

ముసునూరు: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఏజెంట్ల ప్రవర్తన, అధికారుల అత్యుత్సాహంతో వైఎస్సార్‌ సీపీ ఓట్లకు గండి పడింది. సోమవారం మండల వ్యాప్తంగా 57 కేంద్రాల్లో పోలింగ్‌ నిర్వహించారు. పోలింగ్‌ అధికారులు పలు చోట్ల అధికార పార్టీకి వ్యతిరేకంగా, టీడీపీ గెలిపించడానికి శతవిధాలా ప్రయత్నం చేశారు. మండల కేంద్రం ముసునూరులోని 79వ పోలింగ్‌ బూత్‌లో ఓటర్లు దేవినేని శ్రీవర్షిణి కెనడా, తులిమెల్లి రవికిషోర్‌ అమెరికాలో ఉన్నారు. దీనిపై ముందే ప్రణాళిక సిద్ధం చేసుకున్న టీడీపీ ఏజెంట్లు, పోలింగ్‌ అధికారితో కుమ్మక్కై, వైఎస్సార్‌ సీపీ ఏజెంట్లు పోలింగ్‌ కేంద్రంలోకి రాకముందే స్థానికులతో దొంగ ఓట్లు వేయించారు. మరి కొన్ని చోట్ల టీడీపీ కార్యకర్తలు ప్రతి చిన్న విషయాన్ని రాద్ధాంతం చేస్తూ, కవ్వింపు చర్యలకు దిగారు. దీనికి తోడు గోపవరంలోని 96వ పోలింగ్‌ బూత్‌లో వృద్ధురాలు ఓటు వేయడానికి రాగా, పోలింగ్‌ అధికారి ఎంపీ అభ్యర్థికి ఓటు వేయించి, ఎమ్మెల్యే అభ్యర్థికి ఓటు వేయకుండా అడ్డుకుని ఫ్యాన్‌ గుర్తుకు వేయాలని ఆమె కోరినా వినకుండా, సైకిల్‌ గుర్తుకు ఓటు వేయించింది. ఆమెతో పాటు వచ్చిన కోడలు ఈ విషయాన్ని గుర్తించి అధికారిని నిలదీసింది. దీంతో ఆ అధికారి దండాలు, దస్కాలు పెడుతూ ఆమెను క్షమాపణ కోరాడు. రెండు చోట్లా వైఎస్సార్‌ సీపీ ఏజెంట్లు, నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించి, ఘర్షణ వాతావరణాన్ని నివారించారు.

ట్రాక్టర్‌ ఢీకొని వ్యక్తి మృతి



కుక్కునూరు: ట్రాక్టర్‌ ఢీకొనడంతో మోటార్‌సైకిల్‌పై వెళుతున్న ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ముత్యాలంపాడుకు చెందిన మాగంటి నవకాంత్‌ (33) సోమవారం సారపాక నుంచి తన మోటార్‌సైకిల్‌పై కుక్కునూరు వైపు వస్తున్నాడు. వేలేరు ముత్యాలమ్మ గుడి దాటిన తరువాత మలుపు రోడ్డు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ నవకాంత్‌ మోటార్‌ సైకిల్‌ను ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.